ప్రజల చేతిలో
www.ayudamdaily.com
# ఆయుధం
The Common People's Voice
ఆదివారం | ఆగస్టు 09, 2026 | సంపుటి : 7 | సంచిక : 62 | పేజీలు : 2


2 లో

## రోజురోజుకు కాంగ్రెస్‌కు ఆదరణ

- వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య

పెద్ది కుటుంబానికి పెద్దదిక్కుగా

# బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

నేడు నల్లబెల్లికి కేసీఆర్

- పార్టీ తరపున రూ.2.25 కోట్ల సాయం
- పార్టీ సీనియర్లు వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించి నిర్ణయం తీసుకున్న అధినేత కేసీఆర్



**వరంగల్, ఆయుధం:** మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం వరంగల్ జిల్లా నర్సంపేటకు రానున్నారు. దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి స్వగ్రామం నల్లబెల్లికి వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించనున్నారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇవ్వనున్నారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలవాలని అధినేత కేసిఆర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా, సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరోకోటి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించారు. అదే సమయంలో పెద్ది సుదర్శన్ రెడ్డి తల్లి అమృతమ్మ వృద్ధాప్యంలో ఉన్నందున వారి బాగోగుల కోసం మరో 25 లక్షలు రూపాయలను తల్లి పేరు మీద బ్యాంకులో జమ చేయాలని కేసీఆర్ నిర్ణయించారు. తద్వారా మొత్తంగా, 2 కోట్ల 25 లక్షల రూపాయలను పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి భారత రాష్ట్ర సమితి ఆర్థిక సహాయాన్ని అందిస్తూ అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నది.
ఇంతటితోనే కాకుండా పిల్లల భవిష్యత్తు, వారి చదువు తదితర కుటుంబ సంక్షేమానికి సంబంధించి పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని అధినేత తెలిపారు. ఈ మేరకు పార్టీ సీనియర్లతో పాటు వరంగల్ జిల్లా పార్టీ సీనియర్ నేతలతో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. కాగా, దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి దశదినకర్మ కార్యక్రమాలు ముగిసిన తర్వాత జిల్లా పార్టీ ముఖ్యులు కూర్చొని వారి కుటుంబానికి సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటారనీ, ఎల్లకాలం వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు.

దేశ స్వాతంత్ర్యం కోసం..

# బీజేపీ, ఆర్ఎస్ఎస్ చేసిందేమీ లేదు

## నీతులు మాత్రమే చెబుతుంటారు: ఖర్గే



- స్వాతంత్ర్య ఉద్యమంలో కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందన్న కాంగ్రెస్ అధ్యక్షుడు
- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు స్వాతంత్ర్య పోరాటంలో ఎలాంటి భాగస్వామ్యం లేదని ఖర్గే విమర్శ
- రాహుల్ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారని ప్రశంస

**జాతీయం, ఆయుధం:**

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఎలాంటి పాత్ర పోషించలేదని ఆరోపించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడింది కాంగ్రెస్ పార్టీయేనని, దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కూడా కాంగ్రెస్ నిరంతరం కృషి చేసిందని అన్నారు. ఈ మేరకు ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో శనివారం నిర్వహించిన బహిరంగ సభలో ఖర్గే పలు వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్ర్యం పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి సహకారం లేదని ఖర్గే అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం జైలుకు వెళ్లిన ఆర్ఎస్ఎస్ సభ్యుడు ఎవరైనా ఉన్నారా? బీజేపీకి చెందిన వారు ఎవరైనా స్వాతంత్ర్యం ఉద్యమంలో జైలుకు వెళ్లారా? అంటూ ఆయన ప్రశ్నించారు. ఒకవేళ ఎవరైనా జైలుకు వెళ్లినా వారు తొలుత కాంగ్రెస్‌లో ఉండి ఆ తర్వాత అటువైపు వెళ్లిన వారై ఉంటారని వ్యాఖ్యానించారు. బీజేపీ నేతలెవరూ స్వాతంత్ర్యం ఉద్యమంలో పాల్గొన్న దాఖలాలు లేవని ఆరోపించారు.

'దేశభక్తిపై మాకు పాఠాలు చెబుతారా?'

భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్యం ఉద్యమంలో భాగస్వామ్యం లేకపోయినా బీజేపీ నేతలు కాంగ్రెస్‌కు దేశభక్తిపై పాఠాలు, నీతులు చెబుతుంటారని ఖర్గే విమర్శించారు. అసలైన దేశభక్తులు కాంగ్రెస్ పార్టీకి చెందినవారేనని అన్నారు. కాంగ్రెస్ ఎవరినీ భయపడదని, ఎవరూ తమను భయపెట్టలేరని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం ఉద్యమంలో కాంగ్రెస్ పోషించిన పాత్రను ప్రజలు గుర్తుంచుకోవాలని ఆయన కోరారు.

రాహుల్ గాంధీపై ప్రశంసలు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటున్నారని ఖర్గే ప్రశంసించారు. యువత, రైతులు, విద్యార్థులు, పేదల సమస్యలను రాహుల్ గాంధీ నిరంతరం ప్రస్తావిస్తున్నారని చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఆయన దేశవ్యాప్తంగా ప్రజలను కలుస్తున్నారని పేర్కొన్నారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్ భారత్ జోడో యాత్ర చేపట్టారని ఖర్గే గుర్తు చేశారు. దేశ రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఆయన ప్రజల్లోకి వెళ్లారని అన్నారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు రాహుల్ నిరంతరం పర్యటిస్తున్నారని చెప్పారు. బీజేపీలో ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకునే నాయకుడు ఎవరైనా ఉన్నారా? అని ఖర్గే ప్రశ్నించారు.

క్విట్ ఇండియా ఉద్యమంతోనే..

1942 ఆగస్టు 8వ తేదీన మహాత్మా గాంధీ ప్రారంభించిన క్విట్ ఇండియా ఉద్యమాన్ని మల్లికార్జున ఖర్గే గుర్తు చేసుకున్నారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఆ రోజు ఎంతో కీలకమైందని చెప్పారు. డూ ఆర్ డై, క్విట్ ఇండియా నినాదాలతో మహాత్మా గాంధీ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేశారని తెలిపారు. క్విట్ ఇండియా ఉద్యమంతో దేశ ప్రజల్లో బ్రిటిష్ పాలనపై వ్యతిరేకత మరింత పెరిగిందని అన్నారు. ప్రజలంతా ఒక్కటై స్వాతంత్ర్యం కోసం పోరాడారని చెప్పారు. చివరకు బ్రిటిష్ పాలకులు దేశాన్ని విడిచి వెళ్లాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అలాంటి చారిత్రక రోజున హల్ద్వానీలో భారీ బహిరంగ సభ జరగడం ఆనందగా ఉందని అన్నారు.

ఉత్తరాఖండ్ త్యాగాలను కొనియాడిన ఖర్గే

ఉత్తరాఖండ్‌ను దేవభూమిగా పేర్కొన్న మల్లికార్జున ఖర్గే, ఆ ప్రాంతానికి దేశ రక్షణలో కూడా ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. కుమావోం, గర్వాల్ రెజిమెంట్లు దేశవ్యాప్తంగా ఎంతో పేరు పొందాయని చెప్పారు. ఆ ప్రాంతం నుంచి ఎంతోమంది సైనికులు దేశ రక్షణ కోసం సేవలందించారని గుర్తు చేశారు. దేశానికి తొలి పరమ్ వీర్ చక్ర అవార్డు అందుకున్న వీర సైనికుడు కూడా ఆ ప్రాంతం నుంచే వచ్చారని ఖర్గే పేర్కొన్నారు. దేశ రక్షణలో ఉత్తరాఖండ్ ప్రజల పాత్రను ఆయన కొనియాడారు. సరిహద్దుల్లో దేశాన్ని కాపాడుకున్న సైనికులకు ప్రజలంతా గర్వపడాలని అన్నారు.





## రేపు రైతు మేళాను విజయవంతం చేయాలి

- హనుమకొండ జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర


2 లో

## ఏరికోరి తెచ్చుకున్న ప్రభుత్వం ఎగిరెగిరి తన్నినట్టుంది

- చాతకాని అసమర్థ ప్రభుత్వం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం
- రైతుల నడ్డివిరుస్తున్న కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి

నదీ జలాల్లో తెలంగాణ హక్కులకు భంగం కలిగితే

# జల ఉద్యమం



- నదీ జలాల హక్కులకన్నా ముఖ్యమైనది ఇంకేమీ లేదు
- జీఆర్ఎంబీ సమావేశం ఎజెండా ఎందుకు అంగీకరించారో ప్రభుత్వం స్పష్టం చేయాలి
- తెలంగాణ హక్కులను ఏ విధంగా కాపాడతారో రేవంత్, ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలి
- కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గు ఉంటే ఈ సమావేశాన్ని బహిష్కరించాలి
- అధికారంలోకి రాగానే హిల్ట్-పీ పాలసీని రద్దు చేస్తాము
- ఇప్పుడు రెగ్యులరైజ్ చేయించుకున్న వాళ్ళు నష్టపోవడం ఖాయం
- నంది నగర్ నివాసంలో మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, ఆయుధం:**

జీఆర్ఎంబీ సమావేశం ఎజెండాను ఒప్పుకున్నారా? ఈ సమావేశానికి హాజరైతారా? హాజరైతే తెలంగాణ ప్రజల తరఫున ఏం చెప్తారు? ఉత్తమ్ కుమార్ రెడ్డి, రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. శనివారం నందినగర్‌లోని నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ''తెలంగాణలో ఉద్యమ స్థాయిలో ఈ జల ఉద్యమం వస్తది. తెలంగాణ నీటి హక్కులకు మించిన మరో ప్రాధాన్యత మా పార్టీకి లేదు. నదీ జలాల్లో కేంద్రమైనా, రాష్ట్రమైనా నష్టం కలిగించేలా వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదు. కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డు పెట్టుకొని తెలంగాణకు నీటి వాటాల్లో అన్యాయం చేస్తే, తెలంగాణ ఉద్యమానికి మించి మరొక ఆందోళన తెలంగాణలో వస్తుంది. తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించే ఎజెండాను ఒప్పుకొని ఎలా మీటింగ్‌కి హాజరవుతుంది? ప్రభుత్వానికి సిగ్గు ఉంటే... ఈ ప్రభుత్వానికి సమావేశానికి ఎలా హాజరవుతారో ప్రభుత్వం చెప్పాలి. తెలంగాణ వ్యతిరేకి ఆదిత్యనాథ్ దాస్ ని సలహాదారుగా పెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సిగ్గుమాలిన చర్య. తెలంగాణలో ఒక్క ఇంజనీర్ కూడా లేరా? ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చెప్పుచేతల్లోకి తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుంది. చంద్రబాబు చెప్పుచేతల్లో రేవంత్ రెడ్డి నడుస్తున్నాడు. రేవంత్ రెడ్డికి సిగ్గుంటే ఆదిత్యనాథ్ దాస్ ని తొలగించాలి. నీళ్లు, నిధులు, నియామకాలతో కొట్లాడిన తెలంగాణలో మరోసారి నీళ్ల దోపిడీకి తెలంగాణ గురవుతున్నది. ఇదే జరిగితే కచ్చితంగా బిఆర్ఎస్ మరోసారి నీళ్ల కోసం ఆందోళన చేయాల్సి వస్తుంది.'' అని హెచ్చరించారు.

### నదుల నుంచి నీళ్లు ఎత్తి పోసుకుంటే... సీఎంకు సోయి లేదు

మేము లక్షల మంది రైతులతో వెళ్లి పంపులు ఆన్ చేస్తామంటేని ఈరోజు పంపులని మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రారంభించింది కాంగ్రెస్ ప్రభుత్వం. మహబూబ్ నగర్ జిల్లా అని, పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డికి పాలమూరు నీళ్లు ఇచ్చే సోయి లేదు. వర్షాలు పడి పక్క రాష్ట్రం నీళ్లు ఎత్తి పోసుకుంటే ముఖ్యమంత్రికి కనీసం సోయి లేదు. ప్రధాన ప్రతిపక్షం ముల్లు కట్టెతో పొడిస్తేనే ఈ ప్రభుత్వం స్పందిస్తుంది లేదంటే నిద్రపోతున్నది.
యాగాలు చేస్తే తప్పు లేదు కానీ... యాగాలతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రికి తన బాధ్యతలు నిర్వహించాలి. కానీ, ప్రజలకు సంబంధించి ముఖ్యంగా రైతాంగానికి సంబంధించిన కష్టాలను పట్టించుకోవాలి. రేవంత్ రెడ్డికి పంపులు ఎప్పుడు ఆన్ చేయాలి, నీళ్లు ఎప్పుడు ఎత్తిపోయాలో కనీస అవగాహన లేదు. పాలమూరు జిల్లా బిడ్డ అని చెప్పుకునే రేవంత్ కనీసం అక్కడికి చెరువులలో నీళ్లు నింపడానికి కూడా సోయి లేదు. సాగునీటి ప్రాజెక్టుల పైన తెలంగాణకు నష్టం జరిగేలా ఆంధ్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతిపాదనలను అంగీకరిస్తున్నారా లేదా అన్నది కాంగ్రెస్ ఇప్పటిదాకా స్పష్టం చేయలేదు.
క్షుద్రపూజలు అని చెప్పి క్షుద్ర రాజకీయాలు చేస్తున్నది కాంగ్రెస్. కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో సిగ్గుపడాలి. తెలంగాణ కోసం కొట్లాడిన వాళ్లం, తెలంగాణ కోసం త్యాగాలు చేసిన వాళ్లం. క్షుద్ర రాజకీయాలు చేయవలసిన (మిగతా 2లో..)



2 లో

## సాహిత్యంలో లెజెండ్ గద్దరన్న

- గద్దర్ వర్ధంతి సభలో జన నాట్యమండలి నాయకుడు సంజీవ్

## యూపీఐ లావాదేవీలపై కేంద్రం క్లారిటీ

**జాతీయం, ఆయుధం:** యూపీఐ లావాదేవీల ఛార్జీలపై కేంద్ర ఆర్థికశాఖ కీలక ప్రకటన చేసింది. వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు ఉండవని వెల్లడించింది. వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ లావాదేవీలన్నీ యథావిధిగా ఉచితంగానే కొనసాగుతాయని తెలిపింది. వ్యాపారులకు సంబంధించి అత్యధిక శాతం యూపీఐ లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయని.. భవిష్యత్తులో ఎండీఆర్ (మర్చంట్ డిస్కౌంట్ రేట్) అమల్లోకి వచ్చినా అందరిపై ఏకపక్షంగా ఉండదని పేర్కొంది. మర్చంట్ లావాదేవీలపైనే నామమాత్రపు ఎండీఆర్ ఉంటుందని తెలిపింది. డెబిట్, క్రెడిట్ కార్డుల ఎండీఆర్ కంటే ఈ ఛార్జ్ తక్కువ ఉంటుందని తెలిపింది. ఎంపిక చేసిన డిజిటల్ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) ఛార్జీ విధించేందుకు బ్యాంకులు, చెల్లింపుల సేవా సంస్థలకు అధికారం కల్పించే సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. డిజిటల్ చెల్లింపులపై ఎండీఆర్ రుసుముల విధింపును అడ్డుకునే పాత నిబంధనలను తొలగించారు. దీంతో యూపీఐ లావాదేవీలన్నింటిపై ఛార్జీలు పడతాయనే పౌరులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో కేంద్రం స్పష్టతనిచ్చింది.



## బీసీల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలి

- 14న పూలే దంపతులు, 18న పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణలు
- సభలు విజయవంతం చేసేలా ప్రజా ప్రతినిధులు, కుల సంఘాలు పాల్గొనాలి
- కుల గణన తదుపరి ప్రక్రియ ముందుకు తీసుకుపోవడానికి ఐక్యంగా ముందుకు సాగాలి
- క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంగా దిశగా కార్యాచరణ పై బీసీ నేతల సమావేశంలో చర్చ

**హైదరాబాద్, ఆయుధం:** బీసీల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో బీసీ మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. బీసీల సమస్యలు, సంక్షేమ కార్యక్రమాల అమలు, రాబోయే విగ్రహావిష్కరణ కార్యక్రమాలు, బీసీ వర్గాల అభ్యున్నతికి తీసుకోవాల్సిన తదుపరి కార్యాచరణపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సమావేశంలో హైదరాబాద్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ పక్కన ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఈ నెల 14వ తేదీన ప్రారంభించేందుకు నిర్ణయించారు. అలాగే ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాలను ఈ నెల 18వ తేదీన ప్రారంభించే కార్యక్రమంపై చర్చించారు.
విగ్రహావిష్కరణ కార్యక్రమాలకు సీఎం రేవంత్ రెడ్డి ని బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు కలిసి ఆహ్వానించాలని సమావేశంలో నిర్ణయించారు. ముఖ్యమంత్రిని కలిసి బీసీ వర్గాల సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా చర్చించాలని నిర్ణయించారు.

### విగ్రహావిష్కరణ సభను ఘనంగా నిర్వహించాలి

మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులు, బీసీ కుల సంఘాల ప్రతినిధులు, బీసీ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సమావేశం పిలుపునిచ్చింది. పూలే దంపతుల ఆశయాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. (మిగతా 2లో..)



# యువత దేశ ప్రగతికై పాటుపడాలి

- క్యాంపు కమాండెంట్ గ్రూప్ క్యాప్టెన్ ఆశిష్ దనాకే

**వరంగల్, ఆయుధం:** యువత దేశ ప్రగతికై పాటు పడాలని CATC V VSC (IGC) క్యాంపు కమాండెంట్ గ్రూప్ క్యాప్టెన్ ఆశిష్ దనాకే పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రారంభమైన సమ్మిళిత వార్షిక శిక్షణా శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. శిక్షణ పొందిన యువత దేశానికే ఆదర్శమవ్వాలన్నారు. యువత క్రమశిక్షణను పెంపొందించుకుని జీవన సాఫల్యాన్ని పొందాలని, అకుంఠిత దీక్షతో జీవిత లక్ష్యాలను ఏర్పరచుకుని, వాటిని సాధించుటకు ప్రణాళిక రూపొందించుకోవాలని, ఆ లక్ష్యాలని సాధించాలని సూచించారు. అనంతరం మీడియా తో మాట్లాడుతూ.., ఈ శిక్షణా శిబిరంలో వివిధ బెటాలియన్లకు చెందిన 450 మంది క్యాడెట్లకు ఇచ్చే వార్షిక శిక్షణ తో పాటు ఆంధ్రతెలంగాణ లోని NCC గ్రూపుల మధ్య మైక్రోలైట్ ఫ్లయింగ్, ఎరో మోడలింగ్, స్కిట్ షూటింగ్, రేంజ్ ఫైరింగ్, టెంట్ పిచింగ్ వంటి ఈవెంట్లలో సుమారు 150 మంది క్యాడెట్ల మధ్యన పోటీ ఉంటుందని తెలియచేశారు. ఈ శిక్షణ పోటీలు ఈ నెల 16 వ తేదీ వరకు కొనసాగుతాయని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వింగ్ కమాండర్ వినోద్ కుమార్ ఆర్యా, యూనిట్ అడ్జుటెంట్ వారెంట్ ఆఫీసర్ ఏకే.త్రిపాఠీ, ఎన్సీసీ అధికారులు లెఫిటెనెంట్ ఓంకార్ , చీఫ్ ఆఫీసర్స్ ఎన్.మనుజేందర్ రెడ్డి, ఎమ్డీ.ఖలీలుద్దీన్, ఫస్ట్ ఆఫీసర్స్ కె.సందీప్ కుమార్, టీ.శ్రీనివాస్, సెకండ్ ఆఫీసర్ ఎం.తిరుమల్, సీటీవో బి.అనిల్ కుమార్, జీసీఐ శీతల్ రానా, వివిధ గ్రూప్ లనుండి వచ్చిన పీఐ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.



# ధర్మ పరిరక్షణకు విశ్వహిందూ పరిషత్‌లో చేరండి

- వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సునీత రామ్ మోహన్ రెడ్డి
- గ్రామ స్థాయిలో ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక చైతన్యం దిశగా ప్రణాళిక రూపకల్పన

**జనగామ, ఆయుధం:** జిల్లా కేంద్రంలోని శ్రీ సీతా రామచంద్రస్వామి దేవాలయంలో విశ్వహిందూ పరిషత్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సునీత రామ్ మోహన్ రెడ్డి, విభాగ్ సంఘటన మంత్రి శివరాములు అతిథిలుగా పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. జిల్లా అధ్యక్షులు ఎనగందుల బిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లాలోని ప్రఖండ స్థాయి, మండల స్థాయి, జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికల రూపకల్పన చేసారు. ప్రతీ గ్రామంలో పరిషత్ సత్సంగం, పూర్తి స్థాయి కార్యవర్గం ఏర్పాటు చేయాలని కేంద్ర సూచనగా తెలిపారు. అందుకోసం ప్రతీ గ్రామం నుండి ధార్మికవేత్తలు, ఔత్సాహిక యువతీయువకులు, అర్చకులు, పండితులు, మహిళలు, వ్యాపారవేత్తలు తదితరులు పరిషత్ లో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోహనకృష్ణ భార్గవ, ఉపాధ్యక్షుడు బాలనారాయణ, కోశాధికారి దిడిగం లక్ష్మణ్, పట్టణాధ్యక్షుడు అంబటి బాలరాజు, సహకార్యదర్శి చిలువేరు హర్షవర్ధన్, తాడూరి సంతోష్, బజరంగ్ దల్ రమేష్, శాయితేజ, నవీన్, దుర్గావాహిని ఝాన్సీ, పరిషత్ సభ్యులు కృష్ణమూర్తి, శివరామ్, పక్కీరు రమేష్, గుజ్జుల కుమార్, పోచన్న, రమేష్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ కృష్ణమూర్తికి పరామర్శ

**రఘునాథపల్లి, ఆయుధం:** రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, బీసీ రాష్ట్ర నాయకుడు చింతకింది కృష్ణమూర్తి తల్లి చింతకింది మల్లమ్మ మృతి చెందగా, శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు వారి నివాసానికి వెళ్ళి నివాళులర్పించారు. జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ సభ్యులు గుడి వంశీధర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, మాజీ మండల అధ్యక్షుడు కొల్లూరు శివకుమార్ గుప్తా, బీసీ రాష్ట్ర నాయకుడు క్రాంతి కుమార్ తదితరులు కృష్ణమూర్తి కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ మల్లమ్మ మరణం



బాధాకరమని, కృష్ణమూర్తి కుటుంబం ధైర్యంగా ఉండాలని, పార్టీ తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో జనగామ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బుసిగంపుల ఆంజనేయులు గౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## రేపు రైతు మేళా–2026ను
# విజయవంతం చేయాలి
## జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర

**హనుమకొండ, ఆయుధం:**

హనుమకొండ జిల్లా కాళోజీ కళాక్షేత్రంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న జిల్లా స్థాయి రైతు మేళా-2026ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి విజయ చంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నూతన సాగు పద్ధతులు, ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, అధిక దిగుబడులు సాధించే విధానాలపై అవగాహన కల్పించేందుకు రైతు మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు, సాగులో ఎదురవుతున్న సవాళ్లపై నిపుణులతో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రైతు మేళాలో మట్టి పరీక్షలు, సాయిల్ ప్రొఫైలింగ్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోని వివిధ కార్యక్రమాలు, ఎరువులు-విత్తనాల వినియోగం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన అధికారులు, శాస్త్రవేత్తలు, నిపుణులు పాల్గొని రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తారని చెప్పారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలపై రైతులకు సమగ్ర సమాచారం అందించడంతో పాటు, ఆధునిక సాంకేతికతను వ్యవసాయంలో వినియోగించుకునేలా ప్రోత్సహించడమే రైతు మేళా ప్రధాన ఉద్దేశ్యమని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. జిల్లాలోని రైతులు పెద్ద సంఖ్యలో రైతు మేళాకు హాజరై, వ్యవసాయ నిపుణులు మరియు అధికారుల సూచనలు, సలహాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర కోరారు.

# రోజురోజుకు కాంగ్రెస్‌కు ఆదరణ

- రానున్న రోజుల్లో బీజేపీ భూస్థాపితం కావడం ఖాయం
- మ్యాగీ నూడిల్స్‌లా బిల్లులు పాస్ చేస్తున్నారు..
- ఎంపీల అభిప్రాయాలకు విలువలేదు
- పార్టీ శ్రేణులు కలిసికట్టుగా ముందుకు సాగాలి
- వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య

**జనగామ, ఆయుధం:** దేశంలో కాంగ్రెస్‌కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య అన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ భూస్థాపితం కావడం ఖాయమని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం తథ్యమని పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ, పట్టణ, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకార మహోత్సవానికి శనివారం వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ, రాహుల్‌గాంధీ ప్రతి అంశంపై చివరి వరకు పోరాటం చేస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న ఆయనను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. పేద విద్యార్థుల కోసం పోరాడుతున్న నాయకుడు రాహుల్‌గాంధీ అని అన్నారు. పేపర్ లీకేజీల వంటి సమస్యలపై పోరాటం చేస్తూ ప్రతిపక్షాలను, ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకురావడంలో ఆయన కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో కీలకమైన బిల్లులను మ్యాగీ నూడిల్స్‌లా రెండు మూడు నిమిషాల్లోనే ఆమోదిస్తున్నారని కడియం కావ్య విమర్శించారు. బిల్లులపై ఎంపీల అభిప్రాయాలను, ప్రజల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. బీజేపీ తమ రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందించిన బిల్లులను దేశంపైన, దేశ ప్రజలపైన రుద్దే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు.



డీలిమిటేషన్ ప్రక్రియను తీసుకురావడం వెనుక బీజేపీ ముందస్తు రాజకీయ లబ్ధి పొందాలనే ఉద్దేశం ఉందని ఎంపీ ఆరోపించారు. అయితే ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును ఎవరూ ప్రభావితం చేయలేరని అన్నారు. ఎంత పెద్ద పాము అయినా చలిచీమల చేతిలో చనిపోయినట్లే.. ప్రజల చేతిలో బీజేపీ కూలడం ఖాయమని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్‌కు ఆదరణ క్రమంగా పెరుగుతోందని, రాబోయే రోజుల్లో ప్రజలు కాంగ్రెస్‌కు మరింత మద్దతు ఇవ్వడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.
బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్‌ను దొంగదెబ్బ తీయాలని ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తున్నాయని ఎంపీ ఆరోపించారు. అందువల్ల ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన బాధ్యత ఉందన్నారు. గ్రూపు రాజకీయాలకు తావులేకుండా కాంగ్రెస్ జెండాను ఎగురవేయడమే ప్రతి ఒక్కరి ప్రధాన లక్ష్యం కావాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం ఉంటుందన్నారు..
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక అభిమానంతో వరంగల్ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సుమారు 6,500 కోట్ల నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజలకు వివరించి, కాంగ్రెస్ పాలనపై విశ్వాసాన్ని మరింత పెంచాలని సూచించారు.
జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ధన్వంతి సమర్థవంతంగా పనిచేస్తున్నారని ఎంపీ ప్రశంసించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన పార్టీ జిల్లా, పట్టణ, మండల, అనుబంధ సంఘాల నాయకులు సమన్వయంతో పనిచేసి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని కోరారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ శ్రేణులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని ఎంపీ డా. కడియం కావ్య పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త పార్టీకి ఒక సైనికుడిలా పనిచేసి కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. వ్యక్తిగత విభేదాలు, గ్రూపు రాజకీయాలను పక్కనపెట్టి కాంగ్రెస్ జెండా, పార్టీ విజయం కోసం అందరూ ఐక్యంగా పనిచేయాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య సూచించారు.
ఈ కార్యక్రమంలో సభాధ్యక్షురాలు డిసిసి ప్రెసిడెంట్ లకావత్ ధన్వంతి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాంబాబు, YTDA బోర్డు మెంబర్ లక్ష్మీనారాయణ నాయక్, జనగామ మున్సిపల్ చైర్మన్ బాలమణి, స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ చైర్మన్ వినయ్, స్టేషన్ ఘనపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు, డిసిసి కమిటీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు, ట్రెజరర్, అధికార ప్రతినిధులు, కార్యదర్శిలు, ఎగ్జిక్యూటివ్ ఈసీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఏరికోరి తెచ్చుకున్న ప్రభుత్వం
# ఎగిరెగిరి తన్నినట్టుంది

- చాతకాని అసమర్థ ప్రభుత్వం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం
- రైతుల నడ్డివిరుస్తున్న కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి

**భూపాలపల్లి, ఆయుధం:**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు.. ఏరికోరి తెచ్చుకుంటే ఎగిరెగిరి తన్నినట్టుందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి పేర్కొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశించిన స్థాయిలో వర్షాలు పడక పంటలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వం తక్షణమే స్పందించి దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా తాగు, సాగునీటి అవసరాల కోసమే దేవాదుల ప్రాజెక్టును నిర్మించారని గుర్తుచేశారు. నిబంధనల ప్రకారం నెలకు 6 టి.ఎం.సి ల నీటిని ఎత్తిపోయాల్సి ఉండగా, 9 పంపులు నడవాల్సిన చోట 6 లేదా 7 మాత్రమే




నడుపుతున్నారని విమర్శించారు. పదవులు పొందిన పాలకుల నిర్లక్ష్యం వల్లే రైతులకు నీళ్లు అందడం లేదన్నారు. రామప్ప నుంచి గ్రావిటీ ద్వారా గణపురం చెరువుకు నీటిని తీసుకురావడానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.18 కోట్లు వెచ్చించి నిర్ణయం తీసుకున్నామన్నారు.. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ పనులను పక్కనపడేసింది. నీటిని తెచ్చే మార్గం ఉన్నా, పంటలను ఎండబెట్టడం బాధాకరం. వెంటనే గ్రావిటీ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయాలి అని డిమాండ్ చేశారు. రైతులకు నీరు అందించడంలో విఫలమైన ప్రభుత్వం, ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించడం సరికాదని ఎద్దేవా చేశారు. ఏరికోరి తెచ్చుకున్న ప్రభుత్వమే రైతుల పొట్ట కొడుతోందని, రైతుల పక్షాన బిఆర్ఎస్ ఎల్లప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు. అదే విధంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని గండ్ర కోరారు. వచ్చే ఆగస్టు 15 నాటికి పెంచిన పింఛన్లను లబ్ధిదారులందరికీ పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి పట్టణ, గణపురం మండల బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## హక్కులకు భంగం కలిగితే
# జల ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి..)

అవసరం మాకు లేదు. అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ బాగుండాలని కోరుకుంటాం. కాంగ్రెస్ లాగ పార్టీ క్షుద్ర రాజకీయాలు మాకు తెలియదు. హరీష్ రావు గుడికి పోతే తప్పా? ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయవచ్చా? కాంగ్రెస్ పార్టీలాగా మేడిగడ్డకు, చెక్ డ్యామ్ లోనూ ధ్వంసం చేసి ఓట్లు దండుకోవాలని చూడలేదు. నీళ్లు ఉన్నా కూడా రైతులను ఎండబెట్టే కాంగ్రెస్ సంస్కృతి మాది కాదు. కరెంటు ఉండి కూడా వ్యవసాయదారుడికి 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదు. ఏ సబ్ స్టేషన్‌కైనా రావడానికి మేము సిద్ధం. 24 గంటల కరెంట్ వస్తే ఇంకా ఎక్కడ ఉందో చెప్పాలి. కనీసం ఐదు, ఆరు సార్లు ప్రతిరోజూ కరెంట్ కోతలు అవుతున్నాయి.
అధికంగా బోనస్, పెన్షన్లు... అధిక బోనస్ చెల్లిస్తామని, అనేక ఇతర హామీలు చేస్తాము, అమలు చేస్తామంటే అధికారం ఇచ్చారు ప్రజలు. కానీ, అవన్నీ పట్టించుకోకుండా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నాడు. పక్క రాష్ట్రం నదుల నుంచి నీళ్లు ఎత్తుతుంటే రేవంత్ రెడ్డికి ఇంకా సోయి లేదు. చేయాల్సిన పనులు చేయకుండా కేవలం దేవుడి పైన భారం వేస్తా అంటే ఆయన కూడా హర్షించడు.
ప్రభుత్వ అధికారుల పైన నమ్మకం లేదు, ఆర్మీని ఈ రంగంలోకి దించుతామని అంత ఘాటుగా ఎప్పుడూ చెప్పలేదు. ”అని కేటీఆర్ పేర్కొన్నారు.

# సాహిత్యంలో లెజెండ్ గద్దరన్న

- గద్దర్ వర్ధంతి సభలో జన నాట్యమండలి నాయకుడు సంజీవ్
- హనుమకొండలో ఘనంగా గద్దర్ వర్ధంతి సభ

**హనుమకొండ, ఆయుధం:** జనం సమస్యలకు జనం భాషను, జనం యాసను, భౌతికవాదాన్ని జోడించి సాహిత్యంలో కొత్త ఒరవడిని సృష్టించిన గొప్ప కవి, కళాకారుడు, ప్రజా యుద్ధ నౌక గద్దర్ సాహిత్యంలో లెజెండ్ అని జననాట్యమండలి నాయకుడు సంజీవ్ అన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రం ప్రెస్ క్లబ్ లో గద్దర్ గళం ఆధ్వర్యంలో విసికె పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం జరిగిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ 3 వ వర్ధంతి సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన ఆయన మాట్లాడారు. తరతరాలుగా దేశంలో జరుగుతున్న దోపిడి, దేశ భూస్వామ్య, పాలకుల దోపిడీకి ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ తోడై దోపిడి ఎలా కొనసాగిందో, ఆ దోపిడిలో




చిక్కుకున్న ప్రజలు ఎలా విలవిలలాడారో గద్దర్ ప్రతి పాటలో కనపడుతుందని అన్నారు. ప్రజల అజ్ఞానం, మూఢనమ్మకాలు, పాలకుల దోపిడి, పోలీసుల ప్రవర్తనపై ప్రజల బాషలో, పలు భాషల్లో పాడి ప్రజలను చైతన్యం చేసి ప్రజా యుద్ధానికి సిద్ధం చేసిన యుద్ధ నౌక గద్దర్ ప్రపంచంలోనే గొప్పవాడని అన్నారు. గద్దర్ అజ్ఞాతంలో ఉన్నపుడు అన్న కోసం మూడు సంవత్సరాలు ఆటో నడిపి గద్దరన్నను సాధుకున్నట్లు ఆవేదనతో మాట్లాడాడు. సాంస్కృతిక ఉద్యమంలో నిర్మాణాత్మకమైన సమస్యల గురించి గద్దర్ వ్రాశాడని, సామ్రాజ్యవాదం గురించి, అమెరికా దోపిడి గురించి రచించి పాడిన గద్దర్ కార్మికుల గురించి, కర్షకుల గురించి, మహిళల గురించి, కూలీల గురించి, తల్లుల త్యాగం గురించి, విద్యార్థుల త్యాగాల గురించి ఏ వర్గాన్ని కూడా విస్మరించకుండా చైతన్యపరిచి తన జీవితాంతం పోరాటం చేశాడని అన్నారు. ఆయా వర్గాల సమస్యలపై, ప్రజల విముక్తికై గద్దరన్న పాడిన పాటలను సంజీవన్న పాడి సభను ఉత్తేజపరిచారు.
డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ ఫ్యూడలిజంతో ప్రజాస్వామిక చర్చలు సాధ్యం కావని, అందుకే పీడిత వర్గాలు విప్లవించాయని అన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన గద్దర్ గళం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పసునూరి రవీందర్ మాట్లాడుతూ పాలకులు గద్దర్ పేరును మాత్రమే వాడుకుంటున్నాయని, ఆయన ఆశయాలకు విరుద్ధంగా పని చేస్తున్నారని విమర్శించారు. గౌరవ అతిథి యశపాల్ మాట్లాడుతూ జనపదాలను విప్లవీకరించాలనే లక్ష్యంతో గద్దర్ అద్భుతమైన పాటలు రాశాడని వివరించారు. గద్దర్ పేరుతో ఒక సాహిత్య సాంస్కృతిక పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. గద్దర్ విగ్రహాన్ని హన్మకొండలో ఏర్పాటు చేయాలని ప్రొ. తిరునహరి శేషు డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో న్యాయవాది ఎగ్గడి సుందర్ రామ్ స్వాగతం పలుకగా సిపిఎం నాయకులు చుక్కయ్య, తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి, ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, హేతువాద సంఘం రాష్ట్ర నాయకులు రమక్క, అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుపాక ఎల్లన్న, అసంఘటిత కార్మిక సంఘాల రాష్ట్ర నాయకులు నలిగింటి చంద్రమౌళి, డి బి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుంచు రాజేందర్, డాక్టర్ మంద వీరస్వామి, తెలంగాణ శ్యాం, సీనియర్ న్యాయవాదులు పులి సత్యనారాయణ, రామస్వామి, షేక్ అబ్దుల్ నబీ, విలాసాగరం సురేందర్ గౌడ్, బండి మొగిలి, సారంగపాణి, రాచకొండ ప్రవీణ్ కుమార్, సంఘాల నాయకులు వలి ఉల్లా ఖాద్రీ, నున్న అప్పారావు, నరోత్తమ్ సూరీ, డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్, కోండ్ర నరింగరావు, దూడల సాంబయ్య, సింగారపు అరుణ న్యాయవాదులు గురిమిల్ల రాజు, ప్రభంజన్, రాజేందర్, ఆనంద్, పాల్గొన్నారు.

# పాసిస్ట్ పెట్టుబడిదారి వ్యవస్థకు ఘోరీ కట్టాలి

- సీపీఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి
- హసన్ పర్తి మండలానికి చేరుకున్న సిపిఐ పాదయాత్ర

**హసన్ పర్తి, ఆయుధం:** దేశంలో మోడీ అధికారంలోకి వచ్చి పేద ప్రజల వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని సీపీఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. శనివారం హసన్ పర్తి మండల కేంద్రానికి చేరుకున్న సిపిఐ ప్రచార జాతాలో హసన్ పర్తి మండల కార్యదర్శి మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జాతీయ నాయకులు చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజా ఉద్యమాలపై ఉక్కు పాదాన్ని మోపుతూ ప్రజాస్వామ్యాన్ని, భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తుందని తెలిపారు. 200 లక్షల కోట్ల అప్పుచేసి దేశ సంపదను పెట్టుబడిదారీ వర్గానికి దోచిపెట్టడానికి వ్యతిరేకంగా విద్యార్థి, యువత, కార్మిక వర్గం తిరుగుబాటుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వికసిత భారత్ పేరుతో విభజన భారత్ ను తయారు చేస్తున్నారని తెలిపారు.




విద్య వైద్యం ఉపాధి ఉద్యోగాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగాన్ని ప్రజాస్వామ్యాన్ని భారత రాజ్యాంగాన్ని రక్షించుకొనుటకు మరో స్వాతంత్ర పోరాటానికి సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. యువతకు ఉద్యోగాలు రైతు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఈనెల 14 వరకు జాతాలను కొనసాగించి సెప్టెంబర్ 1న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద లక్షలాది మందితో మహా ధర్నా నిర్వహించి మోడీ ప్రభుత్వాన్ని దిగి వచ్చేలా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. ఈ ప్రచార జాత కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శులు మద్దెల ఎల్లేష్, తోట బిక్షపతి, బీకేఎంయూ జాతీయ నాయకులు మోతె లింగారెడ్డి, జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి, ఎన్ఏ స్టాలిన్, ఊట్కూరు రాములు కర్రే లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, నాయకులు రాజ్ కుమార్, షేక్ బాబు, లక్ష్మయ్య, ప్రవీణ్, మాదాసి బాబు, రాసమల్ల దీన, రాజమణి, మంగ, మమత పాల్గొన్నారు.

# బీసీల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలి

(మొదటి పేజీ తరువాయి..)

రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టినప్పటికీ, బీసీ వర్గాల ఆకాంక్షలు, లక్ష్యాలు పూర్తిస్థాయిలో నెరవేరలేదనే అభిప్రాయంతో తదుపరి కార్యాచరణపై ఐక్యంగా ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతికి బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి తగిన నిధులు కేటాయించే అంశంపై కృషి చేయాలని నిర్ణయించారు. అలాగే బీసీ కమిషన్‌ను మరింత బలోపేతం చేసి, బీసీల సమస్యల పరిష్కారంలో కమిషన్‌కు అవసరమైన సహకారం అందించాలని చర్చించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, నవీన్ యాదవ్, ఈర్లపల్లి శంకరయ్య , పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే దానం నాగేందర్ జూమ్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by V.P.CHANDER. On Behalf of VNR MEDIA. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695